సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



భూసారానికి నవధాన్య సాగు

ప్రధాన పంటకు ముందు నవధాన్యాల సాగు చేపడితే సేంద్రియ కర్బనాన్ని పెంచుతుందని, దీనిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు.


8 లో



బాకీ అడిగాడని కడతేర్చారు

గత నెల 26వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. నందమూరు - దొమ్మేరు పుంతరోడ్డులోని పొలంలో పెండ్యాల ప్రభాకరరావు (46) హత్యకు గురైన విషయం తెలిసిందే.

డెల్టా కాలువలకు 7,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 7,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,900, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.75 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

- జిల్లాలో మెరుగైన ఫస్టియర్ ఫలితం
- సెకండియర్‌లో మరింత దిగజారిన స్థానం

రాయవరం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బాలికలు మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో వారి హవా కనిపించింది. గత విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా బాలికలు మంచి ఉత్తీర్ణతను కనబరిచారు. శనివారం విడుదలైన ఫలితాల్లో జిల్లాలో ఫస్టియర్ జనరల్ ఒకేషనల్ ఫలితాల్లో 60 శాతం ఉత్తీర్ణత సాధించగా, జనరల్ ఫలితం 63 శాతం ఉత్తీర్ణత కన్పించింది. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఫలితాన్ని గమనిస్తే 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేవలం ఇంటర్ సెకండియర్ జనరల్ ఫలితాన్ని గమనిస్తే 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత విద్యా సంవత్సరంలో ఫస్టియర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయి ఫలితాలో 17వ స్థానం నుంచి 16వ స్థానంలో నిలిచి కొంత మెరుగైనా, సెకండియర్ ఫలితాల్లో గతేడాది దక్కించుకున్న 16వ స్థానం నుంచి 19వ స్థానానికి దిగజారింది.

ఫస్టియర్ నుంచి 4,520 మంది బాలురు పరీక్షలు రాయగా 2,472 మంది (55శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 6,178 మందికి 4,300 మంది ఉత్తీర్ణత (70శాతం) సాధించారు. మొత్తంగా ఫస్టియర్ 10,698 మందికి 6,772 మంది (63 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ ఫలితాలను చూస్తే బాలురు 3,824 మందికి 2,760 మంది ఉత్తీర్ణత (72శాతం) సాధించగా, బాలికల విషయానికి వస్తే 5,653 మందికి 4,671 మంది (83శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 9,477 మందికి 7,431 మంది (78 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

ఒకేషనల్ ఫలితాల్లో ఫస్టియర్ 829 బాలురు పరీక్షకు హాజరు కాగా 268 (32శాతం), బాలికలు 1,086 మందికి 589 మంది (54శాతం) ఉత్తీర్ణులయ్యారు. 1,915 మంది ఫస్టియర్ ఒకేషనల్ పరీక్షకు హాజరవగా 857 మంది (45శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ సెకండియర్ ఫలితాలను గమనిస్తే 795 మంది బాలురకు 450 మంది (57శాతం), 1,142 మంది బాలికలకు 836 మంది (73శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ మొత్తం 1,937 మంది పరీక్షకు హాజరు కాగా, 1,286 మంది (66శాతం) ఉత్తీర్ణత సాధించారు.

అలరించిన కవి సమ్మేళనం

జాతీయ స్థాయిలో 126 మంది కవుల రాక



వేదికపై మాట్లాడుతున్న శ్రీశ్రీ కళా వేదిక సీఈవో డాక్టర్ ప్రతాప్

అమలాపురం టౌన్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళ వేదిక 147వ జాతీయ స్థాయి ఉగాది శతాధిక కవి సమ్మేళనం స్థానిక శ్రీకళ రెసిడెన్సీలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీనుల విందుగా సాగింది. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి 126 మంది కవులు హాజరై ఉగాది కవితా గానాలతో అలరించారు. వేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో తెలుగు కవిత్వానికి వెలుగులు నింపిన మహా కవులు డాక్టర్ బోయి భీమన్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు సాహితీ దిగ్గజాలు పూల మాలలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి మాట్లాడుతూ కవిత్వం అంటే అక్షర తాండవమని, కాలంతో పాటు కవిత్వం మారాలని ఆమె సూచించారు. సమ్మేళనానికి విచ్చేసిన ప్రతీ కవిని వేదిక తరఫున ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. వచ్చే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రతాప్ వెల్లడించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయిత సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, వేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణలు పర్యవేక్షించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది కళారత్న హంస పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ ప్రతాప్‌ను కవులు అభినందించారు. సమ్మేళన సభలో వేదిక కమిటీ సభ్యులు యెందూరి సీతామహాలక్ష్మి, పోలిశెట్టి అనంతలక్ష్మి అరిగెల బలరామమూర్తి, శ్రీపాద రామకృష్ణ, కడలి సత్యనారాయణ, గోదావరి పత్రిక సంపాదకుడు బొళ్ల సతీష్‌లు ప్రసంగించారు.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

అమలాపురం రూరల్: ఈ నెల 14వ తేదీ సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవుగా ప్రకటించిందని ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

వైద్య నారాయణులు ఏరీ?

- డాక్టర్లు అందుబాటులో లేక కాకినాడ వెళుతున్న రోగులు
- పోస్టుల భర్తీ కోసం ఎదురుచూపులు
- గైనిక్ పోస్టుల్లోనూ డెప్యుటేషన్ విధులు
- ఆర్థోపెడిక్, జనరల్ ఎండీ లేక అవస్థలు



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

అమలాపురం టౌన్: అది వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి. కోనసీమ పేద ప్రజలకు వైద్య సేవలు అందించే పెద్ద ఆస్పత్రి. అమలాపురం జిల్లా కేంద్రం అయ్యాక ఈ ఆస్పత్రి ప్రాధాన్యం మరీ పెరిగింది. అమలాపురం సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు ఈ ఆస్పత్రి బోధనా ఆస్పత్రి అవుతోంది. ఇప్పుడున్న వంద పడకల స్థాయి కాస్తా బోధనా ఆస్పత్రి అయ్యాక 650 పడకలకు అప్‌గ్రేడ్ కానుంది. అంతటి అత్యవసర వైద్య సేవలు అందించే అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నేడు కీలక వైద్య పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వం అలక్ష్యం వహిస్తోంది. ఫలితంగా ఆయా కీలక విభాగాలకు వైద్యులు లేక ఆ వైద్య సేవలు పూర్తి స్థాయిలో రోగులకు అందడం లేదు. రోజూ 400 నుంచి 500 వరకూ ఓపీ ఉండే ఈ ఆస్పత్రిలో 70 నుంచి 80 మంది వరకూ ఇన్ పేషెంట్లు ఉంటారు. ఇలాంటి పెద్దాసుపత్రిలో రెగ్యులర్ గైనిక్‌లు (ప్రసూతి నిపుణులు) లేక అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. ఆస్పత్రికి మూడు రెగ్యులర్ గైనిక్ వైద్యులు ఉండే వారు. ఇందులో రెండు పోస్టులు గతంలోనే ఖాళీ అయ్యాయి. మూడో పోస్టు మొన్నటి వరకూ ఉండేది. ఆ గైనిక్ డాక్టర్ మెటర్నిటీ లీవులో వెళ్లడంతో ఆస్పత్రిలో రెగ్యులర్ గైనిక్‌లు లేకుండా పోయింది. దీంతో పి.గన్నవరం ప్రభుత్వ వైద్యాలయం నుంచి ఓ గైనిక్ డాక్టర్ డిప్యూటేషన్‌పై వారంలో మూడు రోజులు అమలాపురం ఆస్పత్రికి వచ్చి సేవలు అందిస్తున్నారు. ఆ వైద్యుడు విధుల్లో లేని మిగిలిన రోజుల్లో ఎవరైనా గర్భిణి లేదా బాలింత అత్యసర వైద్యం కోసం వస్తే గైనిక్ డాక్టర్ లేరన్న సమాధానం లేదా వేరే ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలన్న సలహా మాత్రం ఆస్పత్రి సిబ్బంది నుంచి అనివార్యమవుతోంది.

ఆర్థోపెడీషియన్ లేక..

ఆస్పత్రిలో మరో కీలకమైన పోస్టు ఆర్థోపెడిక్ వైద్యుడు. ఆ పోస్టు ఖాళీగా ఉండి వైద్యుడు లేకపోవడంతో ఏదైనా రోడ్డు ప్రమాదం లేదా మరేదైనా సంభవించినప్పుడు కాళ్లు, చేతులు విరిగిన సందర్భాలలో ఆస్పత్రిలో శస్త్ర చికిత్స అటుంచి కనీసం ప్రాథమిక వైద్యం అందించే పరిస్థితి కూడా లేదు. ఇక జనరల్ ఎండీ పోస్టు లేక డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలకు అందే సాధారణ వైద్యం కూడా సక్రమంగా అందడం లేదు.

ఆస్పత్రిలో ఇలా కీలకమైన గైనిక్‌లు ముగ్గురి వైద్యులు, ఆర్థోపెడిక్ వైద్యుడు, జనరల్ ఎండీ ఈ అయిదు పోస్టులు లేక రోగులు అవస్థలు పడుతున్నారు. గర్భిణులు, బాలింతలు ఈ ఆస్పత్రికి వచ్చి వైద్యులు అందుబాటులో లేక ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. కొందరైతే ప్రైవేటు ఆస్పత్రులను విధి లేక ఆశ్రయించి వేలకు వేలు బిల్లులు చెల్లిస్తున్నారు.



ఆర్థోపెడిక్ వైద్యుడు లేక ఖాళీగా ఉన్న ఆ వైద్య విభాగం గది

అందుకే రిఫర్ టూ కాకినాడ

గర్భిణులు, బాలింతలకు ఏదైనా అత్యవసర వైద్యం లేదా శస్త్ర చికిత్స అనివార్యమైనా, రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు లేదా చేతులు విరిగిపోయినా ఆ కేసులను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి ఇక్కడ వైద్యులు సిఫార్సు చేసి ఆ లేఖను చేతిలో పెడుతున్నారు. కొందరైతే కాకినాడకు వెళ్లే బదులు ఇక్కడే ఏదైనా ప్రైవేటు ఆస్పతికి వెళ్లి వైద్యం చేయించుకుంటే బాగుంటుందన్న అభిప్రాయంతో ప్రత్యామ్నాయంగా ఆలోచిస్తున్నారు. ఆస్పత్రిలో దాదాపు 12 వైద్య పోస్టులు ఉన్నప్పటికీ కీలక పోస్టులు లేకపోవడంతో రోగుల సంఖ్య కూడా ఆస్పత్రికి తగ్గిపోతోంది.

త్వరలోనే వైద్య పోస్టుల భర్తీ



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఖాళీ పోస్టుల భర్తీ త్వరలోనే జరగనుంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 65 వైద్య పోస్టులకు ఇంటర్వ్యూలు జరిగితే కేవలం 22 పోస్టులే భర్తీ అయ్యాయి. ఆ పోస్టుల్లో అమలాపురం ఆస్పత్రికి భర్తీ కాలేదు. గైనిక్ డాక్టర్ డిప్యూటేషన్‌పై వారానికి మూడు రోజులు ఇక్కడే ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. మూడు రెగ్యులర్ గైనిక్ పోస్టుల్లో ఒక వైద్యురాలు మెటర్నిటీ లీవులో వెళ్లడం వల్ల డిప్యూటేషన్ విధానంలో మరో వైద్యురాలిని నియమించాం. రెండు లేదా మూడు వారాల్లో వైద్య పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

– డాక్టర్ కె.శంకరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

అయినవిల్లిలో భక్తుల కిటకిట



స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి స్వామికి నివేదించారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో మూడు జంటలు, లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 41 మంది, లక్ష్మీగణపతిహోమంలో 15 జంటలు, స్వామివారి గరిక పూజలో రెండు జంటలు పాల్గొన్నారు. స్వామి వారి సన్నిధిలో తొమ్మిది మంది చిన్నారులకు అక్షరాభ్యాసం, నలుగురికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. 13 మందికి అన్నప్రాశన నిర్వహించారు. స్వామికి ఐదుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 29 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2875 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,79,230 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

వైభవంగా వెంకన్న శ్రీపుష్పోత్సవం



వాడపల్లి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామికి పుష్పోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరుని శ్రీపుష్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన కల్యాణమహోత్సవాలు ఏడో రోజు ఆదివారం రాత్రి శ్రీపుష్పోత్సవంతో ఘనంగా ముగిసాయి. ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, వైఖానస పండితులు ఖండవల్లి రాజేశ్వరవర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి రాత్రి శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పిండివంటలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురికి దంపతి తాంబులాలు అందచేశారు.

ర్యాలి జగన్మోహినీ కేశవస్వామికి..

పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామికి ఆదివారం నిర్వహించిన శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

జగ్గిరెడ్డికి అభినందనలు



నూతన అధ్యక్షుడు జగ్గిరెడ్డిని కలిసిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ అనురాధ

అల్లవరం/రావులపాలెం : కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని స్థానిక గోపాలపురంలోని ఆయన స్వగృహంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ చింతా అనురాధ, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిలు పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: నిరుపేదలకు భూముల క్రమబద్ధీకరణ చట్టం – 2025 ఒక వరమని జిల్లా జేసీ టి.నిశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ వివాదాలు, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ చట్టాలు, నిబంధనల్లో సమూల మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావించి భూముల క్రమ బద్ధీకరణ పథకం–2025 ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ భూమి వినియోగ మార్పిడి. కన్వర్షన్ తదితర పథకాలను మరింత బలోపేతం చేస్తూ అసైన్డ్ భూముల చట్టం ప్రకారం భూములను ఫ్రీహోల్డ్ చేయడంలో పేద వర్గాల ప్రయోజనాలు కాపాడే కొత్త పాలసీని ఖరారు చేసింద న్నారు. జీవో 30 ద్వారా రెవెన్యూ శాఖకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. 2019 అక్టోబర్ 15వ తేదీని కటాఫ్ డేట్‌గా ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. క్రమబద్ధీకరణకు అర్హులు కాని భూములు అనగా మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్ లో నిర్దేశిత స్థలాలు. లే అవుట్లు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాలకు ఈ ఉత్తర్వులు వర్తించవన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేయనున్నారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేర్ల పైనే జారీ చేస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపుగా గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు దాఖలు చేయాలని జేసీ స్పష్టం చేశారు.

కూటమి వల.. గంగపుత్రులు విలవిల

- అప్పుడు..ఇప్పుడు అదే మోనం
- 24 గంటల్లో వేట నిషేధం
- అటకెక్కిన మత్స్యకార భరోసా
- రూ.20 వేలు ఇస్తామని బాబుదగా

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నడిసంద్రమే జీవనాధారంగా బతుకు నావను నెట్టుకొస్తున్న గంగపుత్రులకు పెద్ద కష్టం వచ్చి పడింది. సముద్రంలో మత్స్య ఉత్పత్తుల పరిరక్షణ కోసం ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు విధించే వేట నిషేధం ఆ కుటుంబాలకు సంకటంగా మారింది. మత్స్యకార కుటుంబాలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టినట్టు కనిపిస్తోంది. సముద్రంపై వేట విరామం అంటే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లేనట్టే. నిషేధ సమయం 60 రోజులు ప్రత్యామ్నాయ ఉపాధి గగనమైపోతుంది. ఎందుకంటే వీరంతా తరతరాలుగా సముద్రంపై వేట తప్ప మరో పని చేయలేరు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు విరామ సమయంలో ఆ కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచే సంకల్పంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా మత్స్యకార భరోసా అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.4 వేలు ఉన్న వేట నిషేధ భృతిని 2019లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా కింద రూ.10 వేలకు పెంచారు. వేట నిషేధం అమలులో ఉన్న సమయంలోనే ఏటా ఠంచన్‌గా భరోసా సొమ్ము జమ చేస్తూ వచ్చారు. ఇలా నిషేధ సమయంలోనే జగన్ భరోసా సొమ్ము అందివ్వడంతో సముద్ర వేటపై ఆధారపడ్డ మత్స్యకార కుటుంబాలు సంతోషంగా ఉండేవి. వేట విరామ సమయం రెండు నెలలకు కుటుంబాలు నెట్టుకురావడానికి లోటు లేకుండా గడచిపోయేది. ఏటా మాదిరిగానే 2023–24 మత్స్యకార భరోసా కూడా ఇచ్చేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధమైంది. ఇందుకు కార్యాచరణ కూడా పూర్తయినప్పటికీ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు.

అధికారంలోకి వచ్చి 10 నెలలు గడచినా..

అప్పుడే రెండోసారి వేట నిషేధ సమయం వచ్చేసింది. ఈ విరామ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే రూ.10 వేల పరిహారాన్ని రెట్టింపు చేసి రూ.20 వేలు ఇస్తామని సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నమ్మించారు. ఎన్నికలు ముగిసి కూటమి సర్కార్ గద్దెనెక్కి 10 నెలలు గడచిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి కూడా వేట విరామం అమలులో ఉంది. బాబు, పవన్ ఎన్నికల్లో ప్రకటించినట్టుగా తమకు రూ.20 వేల పరిహారం ఇస్తారని వేలాది మత్స్యకార కుటుంబాలు గంపెడాశలు పెట్టుకున్నాయి. వేట నిషేధ సమయంలో పస్తులతో కుటుంబాలను నెట్టుకొచ్చినా కూటమి ప్రభుత్వం కనీసం మానవత్వం చూపించలేదు. సూపర్ సిక్స్ హామీల మాదిరిగానే మత్స్యకారులకు ఇచ్చిన మాటను కూడా నడిసంద్రంలో విడిచి పెట్టేసింది. ఫలితంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సముద్ర వేటపై ఆధారపడ్డ వేలాది మత్స్యకార కుటుంబాలు చుక్కాని లేని నావ మాదిరిగా తయారయ్యాయి. ఇచ్చిన హామీ అమలు చేయకుండా గాలికొదిలేయడంతో ప్రత్యామ్నాయ ఉపాధి లేక రోడ్డున పడ్డాయి. చంద్రబాబు అండ్ కో మాటల గారడీతో నిలువునా ముంచేశారని మత్స్యకార కుటుంబాలు ఘొల్లుమంటున్నాయి.

ఈసారీ కడుపు మాడ్చుకోవాల్సిందేనా?

గత ఏడాది వేట విరామ సమయంలో పరిహారం రేపు ఇస్తాం, మాపు ఇస్తామంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఎగనామం పెట్టింది. అసలు గత విరామ సమయంలో పరిహారం అందుకోకుండానే రెండోసారి వేట నిషేధ సమయం మరో 24 గంటల్లో అమలులోకి వచ్చేస్తోంది. పెండింగ్ పరిహారం ఊసే లేదు అని మత్స్యకారులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్వాకంతో మరోసారి కడుపు మాడ్చుకోవాల్సిందేనని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నిషేధ సమయంలో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు పరిహారం ఏడాది కావస్తున్నా అందించలేదు. కూటమి ప్రభుత్వంలో రెండోసారి కూడా అందుతుందనే నమ్మకం కలగడం లేదంటున్నారు. ఇలా నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబుకు మించిన నాయకుడు లేడనే విషయం మరోసారి రుజువైందని మత్స్యకారులు ఆక్షేపిస్తున్నారు.



ఉప్పాడ తీరంలో లంగరేసిన బోట్లు

కాకినాడ జిల్లాలో ...

మండలాలు: తుని, తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, తాళ్లరేవు
మత్స్యకార తీర గ్రామాలు: 36
మెకనైజ్డ్ బోట్లు: 467,
మోటారు బోట్లు: 3,779,
సంప్రదాయ బోట్లు 399
వేట నిషేధ లబ్ధిదారులు: 24,147 మంది

కోనసీమ జిల్లాలో..

మండలాలు: ఐ.పోలవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, మామిడికుదురు, ఉప్పలగుప్తం, సఖినేటిపల్లి, రామచంద్రాపురం, కె గంగవరం, అల్లవరం, సఖినేటిపల్లి
తీరప్రాంత గ్రామాలు: 45
మొత్తం బోట్లు: 1,700
అర్హులైన మత్స్యకారులు : 9,575 మంది


ఉమ్మడి తూర్పున..

లబ్ధిదారులు: 33,704 మంది
ఇవ్వాల్సిన మొత్తం: రూ.67.407 కోట్లు

జగన్ హయాంలో...

మత్స్యకార భరోసా వేటకు వెళ్లే ప్రతి కుటుంబానికి రూ.10వేల చొప్పున
2019-20లో-23,190 మందికి రూ.23.19 కోట్లు
2020-21లో-24,587 మందికి రూ.24.587 కోట్లు
2021-22లో-30,213 మందికి రూ.30.213 కోట్లు
2022-23లో-21,394 మందికి రూ.21.394 కోట్లు
2023-24లో-24,147 మందికి రూ.24.147 కోట్లు
2019-20 నుంచి వేట నిషేధంతో ప్రభావితమైన బోటు యజమానులు, కళాసీలు 1,23,531 మందికి రూ.123.531 కోట్లు జమ చేశారు.

బాబూ.. మాట నిలబెట్టుకో..



మత్స్యకార భరోసా ఏడాదికి రూ.20,000 ఇస్తామని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. గత ఏడాది మత్స్యకార భరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇప్పుడు మరోసారి వేట నిషేధ సమయం వచ్చేసింది. అయినప్పటికీ గత ఏడాది ఇవ్వాల్సిన భరోసా ఇంతవరకు ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిషేధ సమయం ముగియకుండానే ఏటా మత్స్యకార భరోసా అందజేసేవారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలకు కలిపి మత్స్యకార భరోసా నిధులు విడుదల చేయాలి.

– చింతా నాగ మునీంద్రరావు, మత్స్యకార నాయకుడు, చింతావానిరేవు, ముమ్మిడివరం మండలం

నిషేధ సమయంలో పస్తులుండాల్సి వస్తోంది

వేట నిషేధ సమయం రెండు నెలలూ ప్రత్యామ్నాయ జీవనోపాధి లేక సముద్రంపై వేటాడే కుటుంబాల వారు పస్తులుండాల్సి వస్తోంది. నిషేధ సమయంలో ఇవ్వాల్సిన పరిహారం సకాలంలో విడుదల చేయక పోవడంతో నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. రూ.10వేలు పరిహారం కాస్తా రూ.20వేలు చేస్తామంటే ఎంతో నమ్మకంగా ఉన్నారు. తీరా రెండోసారి నిషేధ సమయం వచ్చేసినా చిల్లి గవ్వ కూడా విడుదల చేయలేదు.

– మేరుగు ఎల్లాజీ, ఎంపీటీసీ సభ్యుడు, ఉప్పాడ

ప్రతి కుటుంబానికి రూ.40వేలు ఇవ్వాలి

చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా మోసం చేయడం తగదు. గత ఏడాది ఇవ్వాల్సిన పరిహారం, ఈ నెలలో నిషేధ సమయంలో ఇవ్వాల్సిన సొమ్ము కలిపి ప్రతి కుటుంబానికి రూ.40 వేలు మత్స్యకారుల ఖాతాలకు జమ చేయాలి. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తోన్న కూటమి ప్రభుత్వం కనీసం మత్స్యకారుల విషయంలో అయినా మాట నిలబెట్టుకోవాలి.

– గుబ్బల తులసీకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పాడ కొత్తపల్లి మండలం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

రత్నగిరిపై పెళ్లి సందడి

- నవ దంపతులతో ఆలయం కిటకిట
- స్వామివారి దర్శనానికి 40 వేల మంది
- రెండు వేల వ్రతాల నిర్వహణ



సత్యవ్రతాలు ఆచరిస్తున్న నవదంపతులు, భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం ఆదివారం వేలాది భక్తులతో కిటకిటలాడింది. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారు జామున రత్నగిరిపైన, శుక్రవారం రాత్రి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. దీంతో నవ దంపతులు, బంధు మిత్రులతో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా, రెండు వేల వ్రతాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. ఆదివారం రాత్రి, సోమవారం పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనుండడంతో రామాలయం వద్ద వార్షిక కల్యాణ మండపం ఎదుట ఉన్న విశ్రాంతి మండపంలో మండపాలు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఆరు సెంటర్లలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 533 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 270 మంది హాజరయ్యారు. కాకినాడ జిల్లా పరిధిలో తొమ్మిది సెంటర్లలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 1,143 మందికి 786 మంది, తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ఐదు సెంటర్లలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా, 809 మందికి 605 మంది హాజరయ్యారు. జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు కోనసీమ జిల్లాలో ఆరు సెంటర్లలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 1,067 మందికి 733 మంది హాజరు కాగా, కాకినాడ జిల్లాలో 1,667 మందికి 1,179 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 1,282 మందికి 954 మంది హాజరైనట్టు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎస్.శైలజ తెలిపారు.

భూసారానికి నవధాన్య సాగు

- పీఎండీఎస్‌తో వేరు వ్యవస్థకు భద్రత
- ఈ పద్ధతిపై విస్తృతంగా అవగాహన
- సేద్యానికి విత్తన కిట్లు సిద్ధం

కొత్తపేట: ప్రధాన పంటకు ముందు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (రుతుపవనాలకు ముందు వేసే పంట – నవధాన్యాల సాగు) సాగు చేపట్టడం ద్వారా సేంద్రియ కర్బనాన్ని పెంచుతుందని, ఈ సాగు పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయశాఖ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రయోగాత్మకంగా నవధాన్యాల రకాల విత్తనాలను కలిపి వెదజల్లే పద్ధతి గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సాగుపై వ్యవసాయ శాఖ కొత్తపేట సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వెంకట రామారవు సాక్షికి వివరించారు.

ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) సాగు అనేది పంట కాలానికి సంబంధం లేకుండా ప్రధాన పంటకు ముందు 20 నుంచి 30 రకాల వివిధ పంట విత్తనాలను కలిపి వెదజల్లి, సాగు భూమిని సజీవ వేరు వ్యవస్థతో ఎల్లప్పుడూ కప్పబడి ఉండే ప్రక్రియ. ఈ ప్రక్రియ 365 రోజులు భూమి పంటలతో కప్పబడి ఉండాలనే వ్యూహంతో ముఖ్య భూమిక పోషిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ విధానాన్ని నవధాన్యాల సాగు పద్ధతిగా పిలుస్తారు. మామూలు పద్ధతిలో చేసే వ్యవసాయ క్రమంలో దుక్కి దున్ని, ఎరువులు వాడి, పంటల మధ్య బీడు పెట్టే ప్రక్రియలో భూమిలో సేంద్రియ కర్బన శాతం తగ్గుముఖం పడుతుంది. ప్రకృతి వ్యవసాయ పంటల సాగు సేంద్రియ కర్బనాన్ని పెంచుతుంది. పంటలు కిరణ జన్య సంయోగ క్రియ నుంచి ఆహారాన్ని తయారు చేస్తాయి. అలా తయారైన ఆహారంలో 30 శాతం వరకు వేర్ల ద్వారా స్రవించబడి, నేల పైపొరల మీద ఆధార పడ్డ అసంఖ్యాక జీవరాశుల సంఖ్యను పెంపొందిస్తూ మొక్కలు, వాటి పోషకాల సరఫరా చేయడానికి సహాయపడుతుంది. పంట కోసిన అనంతరం తదుపరి పంట విత్తు వరకు నేలలోకి కార్బన్ విడుదల చేయడం ఆగిపోతుంది. కాబట్టి ఏడాది పొడవునా నిరంతరాయంగా పంటలను పండించడం వల్ల సేంద్రియ కర్బన శాతం నేలలోకి చేరుతుంది. ప్రతి సీజన్లో పంటల వైవిధ్యాన్ని మెరుగుపరచడానికి, బీడుగా ఉండే భూములను పంటలతో సాధారణంగా వేసవి నెలలలో పొలాలు బీడుగా ఉంటాయి కాబట్టి పీఎండీఎస్ లోని పలు పంటల ద్వారా ఆదాయం, భూమిలో పోషకాల పెంపుదలతో పాటు పశువులకు నాణ్యమైన పచ్చిమేతగా పొందేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది. ప్రస్తుతం రబీ అనంతరం ఖరీఫ్‌కు ముందు అంటే రుతుపవనాలకు ముందు బీడుగా ఉండే నెలలలో పంటలు సాగు చేయడానికి డ్రై సోయింగ్ పద్ధతి అనువైనది.

ఈ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు

పీఎండీఎస్ పద్ధతిలో 365 రోజులు భూమి కప్పబడి ఉంచే నిరంతర సాగు ప్రక్రియకు శ్రీకారం చుడుతుంది. వివిధ పంటల వేర్లు భూమిలో వైవిధ్య రకాల సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పించి పంటలకు ఉపయోగపడే వీటి సంతతిని అభివృద్ధి చేస్తాయి. తద్వారా ప్రధాన పంటకు కావల్సిన స్థూల, సూక్ష్మ పోషకాలను అందుబాటులోకి తీసు కువచ్చి మొక్కల వేరు వ్యవస్థ గ్రహించేటట్టు చేస్తాయి. నవధాన్య పంటలు పశువులకు పోషక విలువలతో కూడిన పచ్చిమేతగా ఉపయోగపడుతుంది. నేల గుల్లబారి వానపాములు వృద్ధి చెందుతాయి. నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. పలు పంటల సాగు వల్ల అదనపు ఆదాయం కలుగుతుంది. నేల కోతకు గురికాదు. జీవ వైవిధ్యం, నేలలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. ప్రధాన పంటలో రసాయనిక ఎరువులు వినియోగం తగ్గుతుంది. ప్రధాన పంటలో కలుపు తగ్గుతుంది. పంటలో చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. ప్రధాన పంట వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది.



కొత్తపేట మండలం బిళ్లకుర్రు సచివాలయంలో నవధాన్యాలను కలగలుపుతున్న వ్యవసాయ సిబ్బంది



నవధాన్య విత్తనాల కిట్లు



కిట్లు పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకట రామారావు

ఈ విధానంలో పంటల విత్తనాలు

- నవధాన్యాల సాగులో 20 నుంచి 30 రకాల పంటలు సాగు చేయవచ్చు. కనీసం 20 రకాలు తీసుకున్నారు. అవి ఇలా..
- పచ్చిరొట్ట పైర్లు – జనుము, జీలుగ, పిల్లి పెసర
- పప్పు ధాన్యం పైర్లు – మినుము, పెసర, ఉలవ, బొబ్బర్లు
- నూనె గింజల పైర్లు – వేరుశెనగ, నువ్వులు, ఆముదం
- చిరు ధాన్యం పైర్లు – జొన్న, కొర్ర, రాగి,
- ఆకు కూరలు – గోంగూర, పాలకూర, తోటకూర, చుక్కకూర,
- తీగ జాతి పంటలు – బీర, ఆనప, దోస తదితర పంటలు
- ఈ విత్తనాల కిట్లను వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందజేస్తున్నారు.
- సుగంధ ద్రవ్యాలు – ధనియాలు, ఆవాలు,

పాడి-పంట

సబ్ డివిజన్ వారీగా అవగాహన

జిల్లా వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఆధ్వర్యంలో మండలాలు, గ్రామాల వారీగా ఈ నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో అమలు చేస్తున్న ఈ పథకానికి సంబందించి ప్రత్యేకంగా ప్రతి సబ్ డివిజన్‌కు ఒక మాస్టర్ ట్రైనర్‌ను నియమించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది రైతులు 22 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబిస్తుండగా సుమారు 22 వేలు కిట్లు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం 98 గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. 9,352 కిట్లు పంపిణీ చేస్తున్నారు. దశల వారీగా గ్రామాలను, విస్తీర్ణాన్ని, కిట్ల పంపిణీని విస్తరిస్తారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక ప్రణాళికను రూపొందించారు. ఉదాహరణకు కొత్తపేట వ్యవసాయ సబ్ డివిజన్‌లో 2227.97 ఎకరాలు విస్తీర్ణం కాగా 2489 మంది రైతులు ఉన్నారు. ప్రస్తుతం 1,336 కిట్ల పంపిణీ చేపట్టారు.

సాగుతో భూసారం వృద్ధి



రైతులు నవధాన్యాల సాగు చేపట్టాలి. తద్వారా భూసారాన్ని పెంచుకోవాలి. ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులను పండించాలి. 20 రకాల విత్తనాల 12 కేజీల కిట్ ఒక ఎకరానికి సరిపోతుంది. ఈ కిట్ ధర రూ 800. రబీ (దాళ్వా) పంట కోతల ముందు చల్లుకోవాలి. బోర్లు సౌకర్యం ఉన్నచోట వేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం వెంకట రామారావు, ఏడీఏ, కొత్తపేట

బాకీ అడిగాడని కడతేర్చారు

- దొమ్మేరు హత్య కేసులో వీడిన మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్ట్
- రెండు మోటారు సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్ల స్వాధీనం
- 36.7 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ
- నిందితుడు పెద్దేవం సచివాలయంలో సర్వేయర్



కొవ్వూరులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ దేవకుమార్, సీఐలు విశ్వం, విజయ్‌బాబు

కొవ్వూరు: గత నెల 26వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. నందమూరు – దొమ్మేరు పుంతరోడ్డులోని పోలంలో పెండ్యాల ప్రభాకరరావు (46) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముగ్గురు నిందితులను ఆదివారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ జి.దేవకుమార్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. పోలవరం మండలం పాత పట్టిసీమకి చెందిన చుక్కా రామ శ్రీనివాస్ ఈ హత్య చేసినట్లు ధ్రువీకరించారు. ప్రధాన నిందితుడు తాళ్లపూడి మండలం పెద్దేవం సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. గోపాలపురం మండలం దొండపూడికి చెందిన అంకోలు జగదీష్ దుర్గాప్రసాద్, పోలవరానికి చెందిన నోముల ప్రవీణ్ కుమార్ నిందితుడికి సహకరించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు ముగ్గురిని 12వ తేదీ మధ్యాహ్నం ప్రధాన నిందితుడు శ్రీనివాస్ ఇంటి వద్ద పట్టణ సీఐ పి.విశ్వం అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వివరాల్లోకి వెళితే మృతుడు ప్రభాకరావు వింటేజ్ కంపెనీ ఉత్పత్తుల వ్యాపారం చేస్తూ ఏజెంట్ల ద్వారా విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే చుక్కా రామ శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. గత ఏడాది డిసెంబర్‌లో ప్రభాకరావు వద్ద శ్రీనివాస్ రూ.2.4 లక్షలు అప్పు తీసుకున్నారు. బాకీ తీర్చమని ప్రభాకరరావు ఒత్తిడి తేవడమే కాకుండా శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు కూడా చెప్పాడు. విలాసాలు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి నిందుతుడు చాలా అప్పులు చేశాడు. ప్రభాకరరావును చంపేస్తే తన బాకీ తీర్చనవసరం లేదని భావించి స్నేహితులైన జగదీష్, ప్రవీణ్‌కుమార్‌లకు తెలిపాడు. మార్చి 26వ తేదీ రాత్రి జగదీష్ దుర్గాప్రసాద్‌ను వెంటబెట్టుకుని కొవ్వూరు పట్టణ శివారున హైవేలో అండర్ పాసేజ్ వద్దకి చేరుకున్నారు. ప్రభాకరరావుకు శ్రీనివాస్ ఫోన్ చేసి రమ్మని పిలిచాడు. ఆర్థిక లావాదేవీలు ఉండడం, వ్యాపార సంబంధాలు ఉండడంతో ప్రభాకరరావు ఇంటి నుంచి మోటారు సైకిల్ వేసుకుని నందమూరు–దొమ్మేరు అండర్ పాసేజ్ వద్దకు చేరుకున్నారు. శ్రీనివాస్ అండర్ పాసేజ్ నుంచి కొద్ది దూరం వచ్చి ప్రభాకరరావు మోటారు సైకిల్ ఎక్కారు. తాను ఫోన్ చేసిన తర్వత రావాలని జగదీష్ దుర్గాప్రసాద్‌కు సూచించాడు. ఇద్దరు కలిసి నందమూరు–దొమ్మేరు పుంత రోడ్డు మార్గంలో వెళుతూ నీరుకొండ శేషగిరిరావుకు చెందిన డ్రాగన్ ఫ్రూట్‌తోట వద్ద మూత్ర విసర్జనకు ఆపమని అడిగాడు. అదే సమయంలో శ్రీనివాస్ తన వెంట తెచ్చుకున్న కత్తితో ప్రభాకరరావుపై విచక్షణారహితంగా పలుమార్లు నరికాడు. అనంతరం ప్రభాకరరావు కంఠం నరికి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఆ సమయంలో మృతుడి కుడి చేతికి ఉన్న బంగారు కడియం, నాలుగు బంగారపు ఉంగరాలు తీయడానికి ప్రయత్నించి రాకపోవడంతో చేతిని నరికి పేపర్ చుట్టి బ్యాగ్‌లో పెట్టుకున్నారు. మృతుడి వద్ద ఉన్న ఫోన్, మెడలో ఉన్న బంగారు గొలుసు, ఉంగరం బ్యాగ్‌లో పెట్టుకున్నాడు. అనంతరం జగదీష్ దుర్గా ప్రసాద్‌కు ఫోన్ చేసి రమ్మని పిలిచి ఇద్దరు కలిసి మోటారుసైకిల్‌పై దొమ్మేరు, కాపవరం మీదుగా పోలవరం వెళ్లి పోయారు. ఈ విషయాన్ని మూడో నిందితుడు ప్రవీణ్‌కుమార్‌కు చెప్పాడు. అనంతరం వారు తెచ్చిన ప్రభాకరరావు చేతికి ఉన్న ఉంగరాలు తీసుకున్నారు. తరువాత చేతిని, హత్యకు వినియోగించిన కత్తిని, ప్రభాకరరావు సెల్‌ఫోన్‌ను, నేరం చేసిన సమయంలో వారు ధరించిన దుస్తులను బ్యాగ్‌లో పెట్టి గుటాల వద్ద గోదావరి నదిలో వదిలేశారు. ఈ కేసులో 31.8 గ్రాముల ఒక బంగారపు గొలుసు, 4.9 గ్రాముల బంగారపు ఉంగరం ప్రధాన నిందుతుడి నుంచి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నేరం చేసిన సమయంలో వినియోగించిన మోటారుసైకిల్‌ను, రెండు సెల్‌ఫోన్లను, జగదీష్ దుర్గా ప్రసాద్ వద్ద నేరానికి వినియోగించిన అతని మోటారు సైకిల్‌ను, ఒక సెల్‌ఫోన్‌ను, ప్రవీణ్‌కుమార్ వద్ద సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గుటాల సమీపంలో నిందితులు గోదావరి నదిలో పడేసిన వస్తువులను, మృతుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో దోచుకున్న బంగారంలో జగదీష్ దుర్గాప్రసాద్ కొయ్యలగూడెంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో కడియం తాకట్టు పెట్టి రూ.1.26 లక్షలు, తాళ్లపూడిలో క్రిస్టియన్ సిరియన్ బ్యాంక్ (సీఎస్‌బీ)లో మూడు ఉంగరాల తాకట్టు పెట్టి రూ.43,600 తీసుకున్నారు. ఈ బంగారు ఆభరణాలను రికవరీ చేయాల్సి ఉందన్నారు. పట్టణ సీఐ పి.విశ్వం, రూరల్ సీఐ కె.విజయ్‌బాబు, ఎస్సై పి.రవీంద్ర, నిడదవోలు ఎస్సై కె.జగన్మోహనరావు, కొవ్వూరు రూరల్ ఎస్సై కె.శ్రీహరి రావు, ఇతర సిబ్బంది ఈ కేసు చేధించడంలో సహకరించారన్నారు. వీరిని జిల్లా ఎస్పీ నరసింహా కిశోర్ అభినందించినట్లు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు.

వైభవంగా తలుపులమ్మతల్లి జాతరోత్సవాలు

- ఘనంగా ప్రారంభం
- 26న జాగరణ, 27న ఊరేగింపు, తీర్థం



గరగలు ధరించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఈఓ, మాజీ చైర్మన్

తుని రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ తల్లి పుట్టింటి సంబరాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. లోవకొత్తూరు రామాలయంలో గతేడాది భద్రపర్చిన గరగలను ఆదివారం నృత్య కళాకారులు తీసి దేవస్థానానికి తీసుకువెళ్లారు. పుట్టధార పవిత్ర జలాలతో సంప్రోక్షణ చేసి అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేసి నూతన వస్త్రాలు, పూలతో అలంకరించారు. గరగలను ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, మాజీ చైర్మన్ దూలం మాణిక్యం, ఇసరపు గాంధీ శిరస్సుపై ధరించి గరగ నృత్యాలతో అమ్మవారి గంధ అమావాస్య సంబరాలను సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. అనంతరం డప్పు కళాకారుల వాయిద్యాల నడుమ లోవకొత్తూరు గ్రామంలో అమ్మవారి ఉపాలయానికి చేరుకున్నారు. ఈఓ మాట్లాడుతూ 14 రోజులు వివిధ గ్రామాల్లో గరగల నృత్యాలు చేస్తూ కళాకారులు అమ్మవారికి విస్తృత ప్రచారం కల్పిస్తారన్నారు. ఈ నెల 26న లోవ కొత్తూరులో ఉపాలయం ప్రాంగణంలో జాగరణోత్సవాలు, వివిధ సాంస్కృతిక, జానపద, సాంఘిక ప్రదర్శనలు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశామన్నారు. 27న ఊరేగింపు నిర్వహించి, తీర్థం, అమ్మవారి దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. మాజీ సర్పంచ్ పలివెల శ్రీనుబాబు, వేదపండితులు, ప్రధాన అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నెమలికి గాయాలు

- రక్షించిన హెడ్‌కానిస్టేబుల్
- అటవీ అధికారులకు అప్పగింత



అటవీ అధికారి దావీదురాజుకు నెమలిని అప్పగిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మాధవ్

రాజమహేంద్రవరం రూరల్: జాతీయపక్షి నెమలిని కుక్కల బారినుంచి రక్షించిన సంఘటన ఆదివారం ఉదయం కొంతమూరు గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతమూరు పప్పులమిల్లు ప్రాంతంలో 14 ఎకరాల లే అవుట్‌లో వై.రామవరం హెడ్ కానిస్టేబుల్ కేవీ మాధవ్ నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం సమయంలో ఎటునుంచో వచ్చిన నెమలిని కుక్కలు తరుముతున్నాయి. ఈ లోగా కేవీ మాధవ్ కుమారుడు చూసి కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న మోటర్‌సైకిలిస్ట్ కుక్కలను తరమడం జరిగింది. దీంతో గాయపడిన నెమలిని హెడ్‌కానిస్టేబుల్ మాధవ్ ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేసి, వెంటనే ఫారెస్టు ఆఫీసర్‌కు ఫోన్ చేశారు. అధికారులు నెమలిని తమ కార్యాలయానికి తీసుకువచ్చి అప్పగించాలని కోరారు. దీంతో కేవీ మాధవ్ లాలాచెరువు పుష్కరవనం దగ్గర ఉన్న ఫారెస్టు రేంజ్ ఆఫీసుకు తీసుకువెళ్లి ఫారెస్టు రేంజ్ అధికారి దావీదురాజుకు అప్పగించారు. జాతీయ పక్షి నెమలికి ఆరోగ్య పరీక్షలు చేసి వైద్య సేవలు అందించి అనంతరం అడవిలో వదిలేస్తామని దావీదు రాజు వెల్లడించినట్టు హెడ్‌కానిస్టేబుల్ కేవీ మాధవ్ తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు



ప్రజల కోలాహలం మధ్య సాగుతున్న ఎడ్ల బళ్ల పోటీలు

రాజానగరం: వ్యవసాయ ఆధారితంగా ప్రాంతాలలో సంప్రదాయంగా వస్తున్న ఎడ్ల బండ్ల పోటీలను ఏటా ప్రభుత్వం తరపున నిర్వహించేలా ప్రతిపాదన చేయనున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని వెలుగుబంద సమీపంలో వృత్తాకారంలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల బళ్ల రాష్ట్ర స్థాయి పోటీలకు అపూర్వ స్పందన లభించింది. జీఎస్ఎల్ వైద్య కళాశాల ఎండీ డాక్టర్ గన్ని సందీప్ పోటీలను ప్రారంభించగా, విజేతలకు ఎమ్మెల్యే బత్తుల బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలలో వ్యవసాయ ఆధారిత రైతు కుటుంబాలకు ఇదొక పండుగలాంటిదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇటువంటి పోటీలు లేకపోతే పశుసంపద అనేది కనుమరుగై పోయేదన్నారు. గ్రామ దేవత సత్తెమ్మ తల్లి తీర్థమహోత్సవాలను పురస్కరించుకుని వెలుగుబందకు చెందిన కూటి కోటేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి 23 ఎడ్ల జతలు పోటీ పడగా, నిర్ణీత వ్యవధిలో గమ్యాన్ని చేరుకున్న ఎనిమిది జతల ఎడ్లను విజేతలుగా ప్రకటించి, బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ. 20 వేలను పెద పైడితల్లమ్మ (లెక్కల వానిపాలెం), రెండో బహుమతిగా రూ. 16 వేలను వేగుల్ల తేజాచౌదరి (మండపేట), మూడో బహుమతిగా రూ. 14 వేలను పోలుపర్తి రామునాయుడు అందుకోగా, మరో ఐదు జతలను కూడా తదుపరి స్థానాలలో విజేతలుగా ప్రకటించి నగదు బహుమతులను అందజేశారు.

అగ్నిప్రమాదంలో గూడపర్తి వాసి మృతి

- అనకాపల్లి బాణసంచా తయారీ కేంద్రంలో ఘటన
- సామర్లకోటకు చెందిన నలుగురికి గాయాలు
- వేట్లపాలెంలో విషాదం

సామర్లకోట: అనకాపల్లి జిల్లా కోటవురట్లలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మండల పరిధిలోని వేట్లపాలెం శివారు గూడపర్తికి చెందిన దేవర నిర్మల (38) మృతి చెందింది. నిర్మలతో పాటు ఆమె భర్త గొడత వీరవెంకటసత్యనారాయణ, సామర్లకోట పెన్షన్‌లైన్‌కు చెందిన యాలంగి రాజు, యాలంగి సంతోషిణి, యాలంగి సారోన్ కూలి పనికి వెళ్లి బాణసంచా తయారీ కేంద్రంలో చేరారు. ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నిర్మల మృతి చెందగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయట పడినట్టు వారి బంధువులు తెలిపారు. నిర్మలతో సహజీవనం చేస్తున్న గూడపర్తికి చెందిన గొడత వీరవెంకటసత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నిర్మల కుటుంబ సభ్యులు హుటాహుటిన అనకాపల్లి వెళ్లారు. ఈ ఘటనతో గూడపర్తిలో విషాద ఛాయలు అలముకున్నాయి. సీఐ ఎ.కృష్ణభగవాన్ గూడపర్తి చేరుకుని సమాచారం సేకరించారు. అక్కడి ప్రమాద వార్త తెలిసిన వెంటనే వేట్లపాలెంలో బాణా సంచాతయారీదారులు తమ దుకాణాలను మూసి వేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు గూడపర్తి చేరుకుని సమాచారం సేకరించారు. కాగా సుమారు ఆరేళ్ల క్రితం పెన్షన్‌లైన్‌కు చెందిన దొకుబుర్ర రాజు, శేషారావులు పెదపూడిలో బాణా సంచాతయారీకి వెళ్లి మృతి చెందిన విషయం తెలిసిందే.

వైభవంగా సప్తస్వర అవధాన వైజయంతి

72 మేళకర్త రాగాలపై అవగాహన సదస్సు



ఆధ్యాత్మిక పాటల రచయిత కేదార్నాథ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని శ్రీత్యాగరాజ ఆరాధన సమితి, ఉభయ తెలుగు రాష్ట్రాల బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు స్వర వీణాపాణిచే సప్తస్వర అవధాన వైజయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీణాపాణిచే 72 మేళకర్త రాగాలపై అవగాహన సదస్సు జరిగింది. వీణాపాణి సప్తస్వర అవధానం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. సభికులు అడిగిన రాగాలలో.. వీణాపాణి చేసిన సంగీత అవధానం ఉర్రూతలూగించింది. విశేష అతిథిగా హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక పాటల ప్రముఖ రచయిత, సాహితీవేత్త పరిమి కేదార్నాథ్ పాల్గొని మాట్లాడారు. అద్భుతమైన సాహిత్యంతో ఆయన సభికులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా స్వర వీణాపాణి, కేదార్నాథ్ తదితరులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. తొలుత ఎల్.గన్నవరంలోని అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వారి నివాసాన్ని వారు సందర్శించారు. సీతమ్మ వారి చిత్రపటానికి పూలమాలలు వేశారు. గ్రామంలోని మూడు దేవాలయాలను సందర్శించి పూజలు చేశారు. ఎల్.గన్నవరంలో మిర్తిపాటి నారాయణ, సూర్యకుమారి దంపతుల చిత్ర పటాలకు, ముంగండలో నడిమింటి నాగరాజారావు చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముంగండలో హైదరాబాద్ బ్రాహ్మణ సంక్షేమ వేదిక సభ్యుడు మిర్తిపాటి రామం నేతృత్వంలో జరిగిన అవధాన కార్యక్రమానికి తెన్నేటి లక్ష్మి నర్సింహమూర్తి సంధాన కర్తగా వ్యవహరించారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక (హైదరాబాద్) వ్యవస్థాపకుడు బాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేముల కిషన్ రావు, బ్రాహ్మణ వేదిక నాయకులు గొల్లపల్లి ఫణీంద్ర, ప్రముఖ చిత్ర కళాకారుడు రవి పరస, తబలా వాద్యకారుడు టి.మోహన్ తదితరులు హాజరయ్యారు. అధిక సంఖ్యలో సంగీత, సాహిత్య అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.